సాక్షి అనకాపల్లి

సోమవారం । 18 । నవంబర్ । 2024



జూ ఆదాయం రూ.7.64 లక్షలు

కార్తీకమాసం మూడో ఆదివారం జూ పార్కుకు రూ.7,64,640 ఆదాయం లభించినట్లు జూ ఇన్‌చార్జి క్యూరేటర్ తెలిపారు.

8లో



సీపీఎస్ రద్దుపై మీనమేషాలు తగదు

2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ వర్తింప చేయకుండా ప్రభుత్వం మీన మేషాలు లెక్కిస్తుందని ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అన్నారు.

8లో

పర్యాటక శోభితం

జిల్లాలో పర్యాటక ప్రాంతాలు సందడిగా మారాయి. టూరిస్టులు, పిక్నిక్‌లకు వచ్చేవారితో కళకళలాడుతున్నాయి.



8లో

న్యూస్‌రీల్

మండల కేంద్రాల్లోనూ పక్కాగా పీజీఆర్ఎస్

తుమ్మపాల: మండల కేంద్రాలు, మున్సిపాలిటీల్లోనూ పక్కాగా ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ(పీజీఆర్ఎస్)ను అమలు చేయనున్నట్టు కలెక్టర్ విజయ కృష్ణన్ ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ శాఖల మండల, మున్సిపల్ కార్యాలయాల్లో ప్రతి సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఈ కార్యక్రమం నిర్వహించి, అర్జీలు స్వీకరించేందుకు ఏర్పాట్లు చేసినట్టు తెలిపారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ పేర్కొన్నారు.

మాడుగులలో రేపు జాబ్ మేళా

అనకాపల్లి: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 19న నిరుద్యోగ యువతీ యువకులకు మాడుగుల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్టు సంస్థ జిల్లా అధికారి ఎన్.గోవిందరావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. టెన్త్, ఇంటర్మీడియెట్, డిగ్రీ విద్యార్హత గల 18 నుంచి 35 సంవత్సరాలు లోపు వయస్సు గల నిరుద్యోగులుఇంటర్వ్యూలకుహాజరుకావచ్చని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 7981102224 అనేఫోన్‌నంబర్‌లోసంప్రదించాలనిఆయన కోరారు.

పాలిటెక్నిక్ కాలేజీలో..

మురళీనగర్(విశాఖ): ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి, శిక్షణశాఖ ఆధ్వర్యంలో కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో ఈ నెల 19న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కె.నారాయణరావు, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి టి.చాముండేశ్వరరావు తెలిపారు. డిప్లమో, బీటెక్ మెకానికల్, ఏదైనా ఐటీఐ, ఏదైనా డిగ్రీ పూర్తి చేసిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఎంపికైౖ అభ్యర్థులు విశాఖపట్నం, దువ్వాడ సెజ్‌లో పనిచేయాల్సి ఉంటుంది. ఆసక్తి కలిగిన వారు https://naipunyam.ap.gov.inలో పేర్లు నమోదు చేసుకోవాలని, మరిన్ని వివరాలకు 77025 06614లో సంప్రదించాలని సూచించారు.

ఆర్టీసీ అద్దె బస్సుల డ్రైవర్ల ఆందోళన



ఆందోళన చేస్తున్న అద్దె బస్సుల డ్రైవర్లు

నర్సీపట్నం: జీతాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఆర్టీసీ అద్దె బస్సుల డ్రైవర్లు ఆదివారం డిపోలో ఆందోళన చేశారు. యజమానుల వేధింపులు ఆపాలంటూ నినాదాలు చేశారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి అడిగర్ల రాజు మాట్లాడుతూ జీతాలు అడిగితే యజమానులు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. డీఎం జోక్యం చేసుకుని డ్రైవర్ల జీతాల సమస్యను పరిష్కరించాలని కోరారు. డ్రైవర్లు ధనుంజయరావు,కె.ఆర్.బాబు,ఎం.నానాజీ, ఎం.ఎ.రాజు,ఎస్.ఎస్.నాయుడు పాల్గొన్నారు.

కూటమి.. గూడుపురాణి!

గూడు కోల్పోయిన వారికి అందజేసే నష్టపరిహారాన్ని బొక్కేసేందుకు కొందరు కూటమి నేతలు గూడుపురాణీ చేస్తున్నారు. నిర్వాసితుల జాబితాలోకి బినామీ పేర్లను చొప్పించి సొమ్ము కాజేసేందుకు అక్రమాలకు పాల్పడుతున్నారు. స్థానికేతరుల పేర్లతో జాబితాలను అందజేసి, పరిహారం కోసం సిఫారసు చేయాలని అధికారులపై వత్తిడి తెస్తున్నారని సమాచారం. కమీషన్‌కు కక్కుర్తి పడి కొందరు అధికారులు కూడా సిద్ధమవుతున్నట్టు తెలిసింది. ఇదే విషయాన్ని అర్హులైన నిర్వాసితులు ఇటీవల స్పందన కార్యక్రమంలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.

- నిర్వాసితుల జాబితాల్లో స్థానికేతరుల పేర్లు
- నష్టపరిహారం కోసం పైరవీలు
- అక్రమాలకు పాల్పడుతున్న కూటమి నేతలు ?
- కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన గ్రామస్తులు



జిరాయితీ భూమిలో రైతులు నిర్మించుకున్న పశువుల షెడ్



నష్టపరిహారం చెల్లింపులకు సంబంధించి నిర్వాసితుల సమస్యలు తెలుసుకునేందుకు రెవెన్యూ అధికారులు నిర్వహించిన గ్రామసభ (ఫైల్)



బినామీ లబ్ధిదారుల జాబితాలపై స్పందనలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేసి తీసుకున్న రశీదు

నక్కపల్లి: విశాఖ–చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ భూసేకరణలో జిరాయతీ, ప్రభుత్వ రస్తాల్లో నిర్మించుకున్న ఇళ్లు కోల్పోయిన వారికి ప్రభుత్వం ఇచ్చే ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ కోసం కూటమినేతలు అక్రమాలకు తెరలేపారని తెలిసింది. పరిహారం దక్కించుకునేందుకు అడ్డదారులు తొక్కుతున్నారని సమాచారం. బినామీలను లబ్ధిదారులుగా చేర్చి, వారి జాబితాలను అధికారులకు ఇచ్చి పరిహారం కోసం సిఫారసు చేయాలని వత్తిడి తెస్తున్నారని భోగట్టా. నేతల అక్రమాలను వివరిస్తూ, వారి సూచించిన పేర్లు స్థానికేతరులవంటూ పేర్కొంటూ మూలపరగ్రామస్తులు ఇటీవల కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. వివరాల్లోకి వెళ్తే విశాఖ చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్‌కోసం ఏపీఐఐసీ చందనాడ, అమలాపురం, రాజయ్యపేట, డీఎల్‌పురం, వేంపాడు తదితర గ్రామాల్లో సుమారు 4,500 ఎకరాల సేకరించింది. జిరాయితీ భూములకు ఎకరాకు రూ.18 లక్షల చొప్పున, డీఫారం భూములకు ఎకరాకు రూ.12 లక్షల చొప్పున నష్టపరిహారం చెల్లించింది. అదేవిధంగా భూముల్లో ఉన్న మామిడి, జీడి తదితర ఉద్యానవన పంటలకు సైతం నష్టపరిహారం చెల్లించింది. భూసేకరణ చట్టం ప్రకారం ఇళ్లు, పశువుల షెడ్లు కోల్పోయిన వారికి, కుటుంబాల్లో ఉన్న మేజర్లకు ఆర్ అండ్ ఆర్‌ప్యాకేజీ చెల్లించి వారికి వేరొక చోట పునరావాసం కల్పించాలి. చందనాడ,అమలాపురం శివారు మూలపర,పాటిమీద, తమ్మయ్యపేట తదితర గ్రామాల్లో రస్తాల్లోను, జిరాయితీ భూముల్లోను ఇళ్లు నిర్మించుకుని నివసిస్తున్న వారికి నష్టపరిహారం చెల్లించాల్సి ఉంది. భూసేకరణ చట్టప్రకారం రూ.24లక్షల చొప్పున నష్టపరిహారం (ఆర్‌అండ్ ఆర్‌ప్యాకేజీ) కింద చెల్లించాలి. భూసేకరణలో కోల్పోతున్న ఇళ్లకు నష్టపరిహారం చెల్లించాలని నిర్వాసితులు ఆందోళన చేస్తున్నారు. అప్పటి వరకు భూములను స్వాధీనం చేయబోమని, ఇళ్లను ఖాళీ చేయమని స్పష్టం చేశారు. పరిహారం చెల్లించేందుకు ప్రభుత్వం ఇళ్ల యజమానుల వివరాలు సేకరిస్తోంది. జిరాయతీ భూములు, రస్తాల్లో ఇళ్లు నిర్మించుకున్నవారి వివరాలు సేకరించేందుకు, నష్టపరిహారం అందించేందుకు గ్రామసభలను నిర్వహించి అర్జీలను స్వీకరిస్తున్నారు. ఇల్లు ఎవరి పేరున ఉంది, ఎంతమంది నివసిస్తున్నారు ఇంటిపన్ను రశీదు ఉందా అనే వివరాలను సర్వే ద్వారా సేకరిస్తున్నారు.

వంద మంది బినామీలతో..

సర్వే జరుగుతుండడంతో గ్రామాల్లో కొంత మంది కూటమినేతలు అక్రమాలకు తెరలేపారు. అధికారాన్ని అడ్డం పెట్టుకుని బినామీలను తెరమీదకు తెచ్చారు. మూలపరలో సుమారు 100 మంది స్థానికేతరులను ఇదే గ్రామంలో నివాసం ఉంటున్నట్టుగా జాబితా తయారు చేసి కూటమి పార్టీలకు చెందిన పెద్దనాయకుల సిఫారసులతో ఆర్‌అండ్ ఆర్ ప్యాకేజీ కోసం ఉన్నతాధికారులకు అందజేశారని సమాచారం. ఇక్కడ ఎవరైనా బంధువులు ఉంటే వారి ఇంట్లో నివాసం ఉంటున్నారని, ఒక భాగం వారికే చెందినదని తప్పుడు రికార్డులు సృష్టిస్తూ నష్ట పరిహారం కోసం పైరవీలు చేస్తున్నారు. స్థానిక టీడీపీ, జనసేన నాయకులు తయారు చేసిన జాబితాలో వెలగా హరిశ్చంద్రప్రసాద్, జి.గౌరీశంకర్, బి.సత్తిబాబు, వారాచార్యులు, పార్వతి, వీరవెంకట సత్యసాయి పాండురంగ, పయ్యావుల నర్సింహమూర్తి, జి.సత్యవతి, కె.జయలక్ష్మి, ప్రగడ నాగేశ్వరరావు, బి.నూకరాజు, యు.మంగ, కరణం వెంకటలక్ష్మి, పి.దేవి, ఎ.వి. రమణ తదితరుల పేర్లు ఉన్నాయని, వీరంతా స్థానికేతరులంటూ ఇటీవల పలువురు నిర్వాసితులు కలెక్టర్‌కు స్పందన కార్యక్రమంలో ఫిర్యాదు చేశారు. కుటుంబ యజమానుల పేర్లతో మాత్రమే జాబితాలు సిద్ధం చేశారని, ఇంట్లో ఎంతమంది కుటుంబ సభ్యులు నివసిస్తున్నారో వివరాలు పేర్కొనలేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. అధికారులకు కూటమినాయకులు అందజేసిన జాబితాలో ఉన్న పేర్లు కలిగిన వారు ఇతర మండలాలు,జిల్లాలకు చెందిన వారని మా గ్రామాలతో సంబంధం లేదని, ఎప్పుడూ ఈ ప్రాంతాల్లో నివసించలేదని గ్రామస్తులు ఫిర్యాదులో పేర్కొన్నారు. భూసేకరణలో వారు సెంటు భూమి గాని, గజం ఇంటి స్థలం గాని కోల్పోలేదని, బినామీలుగా వారి పేర్లు తెరమీదకు తెచ్చి స్థానిక నాయకులు పరిహారం కోసం అడ్డదారులు తొక్కుతున్నారంటూ కలెక్టర్‌కు రాతపూర్వకంగా స్పందనలో ఫిర్యాదు చేశారు.

స్థానికేతరుల పేర్లతో ఇంటి పన్ను రశీదులు

బినామీలుగా లబ్ధిదారుల జాబితాలో చేర్చిన స్థానికేతరుల పేరిట నకిలీ ఇంటిపన్ను రశీదులు సృష్టిస్తున్నారని తెలిసింది. అవినీతి ఆరోపణలపై తాజాగా సస్పెండ్ అయిన పంచాయతీ కార్యదర్శి ఒక్కొక్కరి నుంచి రూ.5 వేల నుంచి రూ.10 వేల వరకూ తీసుకుని ఇంటిపన్ను రశీదులు ఇచ్చినట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. కూటమినాయకులు అధికారాన్ని అడ్డంపెట్టుకుని ఆర్ అండ్ ఆర్‌ప్యాకేజీపేరుతో కోట్లాదిరూపాయలు స్వాహా చేసేందుకు పైరవీలు చేస్తున్నారని మండల వాసులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వంనుంచి పొందిన నష్టపరిహారాన్ని కూటమినాయకులు ,మాజీ ప్రజాప్రతినిధులు, బినామీ లబ్ధిదారులు పంచుకునేందుకు ఈ పరిహారంలో కొంత మొత్తాన్ని అధికారులకు కూడా చెల్లించేందుకు ఒప్పందం కుదుర్చుకున్నట్లుగా ప్రచారం జరుగుతోంది. కలెక్టర్ ఈ అక్రమాలపై ప్రత్యేక దృష్టి సారించి కూటమినేతలు ఇచ్చిన జాబితాలపై సమగ్రవిచారణ జరిపించాలని, వాస్తవంగా ఇళ్లు కోల్పోతున్న వారికే నష్టపరిహారం చెల్లించాలని ఆయా గ్రామస్తులు కోరుతున్నారు.

సమగ్రంగా దర్యాప్తు చేయాలి

మా గ్రామంతో పాటు శివారు గ్రామాల్లో నివాసం లేని వారిపేర్లను జాబితాలో చేర్చి ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ పొందేందుకు బినామీలను తెరమీదకు తెచ్చారు. పదేళ్ల క్రితం నుంచి ఎటువంటి ఇంటి పన్ను రశీదులు, కరెంట్ బిల్లులు, ఆధార్ కార్డులు లేనివారిని ఈ ప్రాంతంలో నివసిస్తున్నట్లుగా జాబితాలు తయారు చేసి కొంతమంది నాయకులు పరిహారం స్వాహా చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. దీనిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాం. తాము ఫిర్యాదులో పేర్కొన్న పేర్లపై సమగ్రంగా విచారణ జరపాలి.

– రామరాజు, అమలాపురం

అర్హులకే నష్టపరిహారం

ఆర్‌అండ్ ఆర్‌ప్యాకేజీ కోసం బినామి పేర్లను చేర్చారంటూ స్పందనలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై ఆయా గ్రామాల్లో విచారణ నిర్వహిస్తున్నాం. అనర్హులని రుజువయితే తొలగిస్తాం. చాలా ఏళ్లనుంచి జిరాయితీ, రస్తాల్లో ఇళ్లు నిర్మించుకుని అన్ని ఆధారాలు కలిగిన వారికి మాత్రమే పరిహారం చెల్లించడం జరుగుతుంది. అక్రమాలకు తావులేకుండా పరిహారం,ప్యాకేజీ చెల్లించేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

– నర్సింహమూర్తి, తహసీల్దార్

వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా కార్యకర్త అరెస్టు

- శ్రీసత్యసాయి జిల్లాకు చెందిన బాలాజీ రెడ్డికి రిమాండ్
- హోం మంత్రిపై అనుచిత పోస్టులు పెట్టారని ఫిర్యాదు

దేవరాపల్లి: శ్రీసత్యసాయిజిల్లా రొద్దం మండలం నాగిరెడ్డి పల్లెకు చెందిన వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా కార్యకర్త నగురూరు బాలాజీ రెడ్డిని స్థానిక ఎస్‌ఐ టి.మల్లేశ్వరరావు శనివారం రాత్రి అరెస్టు చేశారు. హోంమంత్రి వంగలపూడి అనితపై సోషల్‌మీడియాలో అనుచిత పోస్టులు పెట్టారని టీడీపీ దేవరాపల్లి మండల అధ్యక్షుడుచిటిమిరెడ్డి సూర్యనారాయణ ఈ నెల6న స్థానికపోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆయన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు సత్యసాయి జిల్లాలో వారం రోజుల పాటు మకాం వేసి, బాలాజీ రెడ్డిపై నిఘా పెట్టారు. ఆయన ఇంటి వద్ద శనివారం రాత్రి అరెస్టు చేసి, అనకాపల్లిలోని అడిషనల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ ముందు ఆదివారం హాజరుపరచగా 14రోజులు రిమాండ్ విధించినట్లు ఎస్‌ఐ టి.మల్లేశ్వరరావు స్థానిక విలేకరులకు తెలిపారు.

టీడీపీ అల్లరి మూక బీభత్సం

- ఆటోలు, బస్సులపై దాడి
- నిందితుల్లో టీడీపీ కౌన్సిలర్ సమీప బంధువు

నర్సీపట్నం: మున్సిపాలిటీ పరిధి బలిఘట్టం మెయిన్ రోడ్డుపై మద్యం మత్తులో అల్లరి మూక ఆదివారం సాయంత్రం బీభత్సం సృష్టించింది. స్థానికుల కథనం ప్రకారం టీడీపీ సానుభూతిపరులైన, పెదబొడ్డేపల్లికి చెందిన శివ, గణేష్ మరో నలుగురు వ్యక్తులు మద్యం మత్తులో వీరంగం సృష్టించి, ఆ దారిన వెళ్లే బస్సులు, కార్లు అద్దాల పగలు కొట్టి ప్రయాణికులను భయాందోళనకు గురి చేశారు. వేములపూడికి చెందిన ఆటోడ్రైవర్ ఎం.సత్యనారాయణ ప్రయాణికులతో వెళ్తుండగా అడ్డగించి చేయి చేసుకోవడంతో పాటు ఆటోపై దాడి చేశారు. ఈ విషయాన్ని స్థానికులు టీడీపీ నాయకుడు గవిరెడ్డి వెంకట రమణకు చేరవేశారు. సంఘటన స్థలానికి వచ్చిన రమణ వారిని వారించడానికి ప్రయత్నించారు. అయితే మద్యం మత్తులో ఉన్న ఆ ఆరుగురు ఆయనపై తిరగబడ్డారు. నీ అంతూ చూస్తామంటూ హెచ్చరించారు. దీంతో అక్కడ గందరగోళ పరిస్థితి ఏర్పడింది. మద్యం మత్తులో వీరంగం సృష్టించిన వారిలో టీడీపీలో ప్రధాన పాత్ర పోషిస్తున్న ఓ కౌన్సిలర్ సమీప బంధువుతో పాటు మరికొంత మంది ఉండడం విశేషం. జరిగిన సంఘటనపై టీడీపీ నాయకుడు రమణ పార్టీ నాయకులతోవెళ్లి టౌన్ సీఐ గోవిందరావుకు ఫిర్యాదు చేశారు. తనపై దాడి చేసి చంపబోయారని, ఆటోను ధ్వంసం చేశారని ఆయనతో పాటు ఆటో డ్రైవర్ సత్యనారాయణ లిఖితపూర్వకంగా సీఐకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు వీరంగం సృష్టించిన వ్యక్తులపై పలు సెక్షన్లపై కేసు నమోదు చేసినట్టు సీఐ గోవిందరావు తెలిపారు.

ఉపాధ్యాయ ఓటర్ల దరఖాస్తుల పరిశీలన

మహారాణిపేట(విశాఖ): ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఓటు నమోదు కోసం సమర్పించిన దరఖాస్తులను శరవేగంగా అధికారులు పరిశీలిస్తున్నారు. ఈ నెల 6వ తేదీ వరకు ఉమ్మడి ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి మొత్తం 17,404 దరఖాస్తులు వచ్చాయి. ఆన్‌లైన్ ద్వారా 4,802, ఆఫ్‌లైన్ ద్వారా 12,602 దరఖాస్తులు స్వీకరించారు. ఈ దరఖాస్తులను ఈ నెల 20వ తేదీ వరకు పరిశీలిస్తారు. 23న ఓటర్ల నమోదుపై డ్రాఫ్ట్‌ను ప్రచురిస్తారు. ఈ డ్రాఫ్ట్ పబ్లికేషన్ మీద 23 నుంచి డిసెంబర్ 9వ తేదీ వరకు అభ్యంతరాలు స్వీకరిస్తారు. డిసెంబర్ 30న తుది ఓటర్ల జాబితాను ప్రకటిస్తారు. గత ఎమ్మెల్సీ ఎన్నికల్లో 19,523 మంది ఓటర్లే ఉన్నారు. ప్రస్తుతం ఉత్తరాంధ్ర టీచర్ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ పదవీ కాలం వచ్చే ఏడాది మార్చి 29 నాటితో పూర్తవుతుంది.

దరఖాస్తులు ఇలా..

జిల్లా	ఆన్‌లైన్	ఆఫ్‌లైన్	మొత్తం
అనకాపల్లి	371	1,511	1,882
విశాఖ	1,252	2,093	3,345
శ్రీకాకుళం	2,072	2,392	4,464
విజయనగరం	555	3,273	3828
పార్వతీపురం మన్యం	340	1,796	2,136
అల్లూరి సీతారామరాజు	212	1,537	1,749

ఆయిల్ పామ్ సాగుతో అధిక ఆదాయం



చింతలూరులో మాట్లాడుతున్న అజిత్ కుమార్ సాహూ

మాడుగుల రూరల్: ఆయిల్‌పామ్ సాగుతో అధిక ఆదాయం పొందవచ్చని జాతీయ నూనె గింజల అభివృద్ధి సంస్థ సంయుక్త కార్యదర్శి అజిత్ కుమార్ సాహూ తెలిపారు. మండలంలోని చింతలూరులో ఆయిల్‌పామ్ తోటలను ఆయన ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయిల్‌పామ్ రైతులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతులు పూర్తి స్థాయిలో మెలకువలు తెలుసుకుని, సాగు విస్తీర్ణం పెంచాలని సూచించారు. సాగుకు ప్రభుత్వం అందిస్తున్న ఆర్థికసాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. పల్లం, మెట్ట భూముల్లో పంటను వేసుకోవాలని, ఆయిల్ పామ్ ధర క్రమేపి పెరుగుతోందని చెప్పారు. గ్రామ, మండల స్థాయి ఉద్యానవన, వ్యవసాయాధికారులు ఈ పంటపై రైతులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని తెలిపారు. డ్రిప్ ఇరిగేషన్ ద్వారా సాగు చేయడం వల్ల అధిక ఆదాయం వస్తుందన్నారు. ఆయన వెంట ఐఏఎస్ అధికారులు ఎం.రఘునందన్‌రావు, కె. పోన్నుస్వామి, ఏపీ ఉద్యానవనశాఖ అదనపు డైరెక్టర్ కె.బాలాజీ నాయిక్, జిల్లా ఉద్యానవనశాఖాధికారి జి.ప్రభాకరరావు, జిల్లా మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్టు అధికారి జి.వి.లక్ష్మి, మండల ఉద్యానవనశాఖాధికారి వి.భాను పుష్పలీలావతి తదితరులున్నారు. అనంతరం బంగారు మెట్టలో గల ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీని సందర్శించారు.

'వాల్తేరు'లో వణుకు



'ఈయన మంచి డీఆర్‌ఎం.. మాకు టెండరు కావాలని అడిగితే.. ఎంతిచ్చినా తీసుకొని ఆ పనులు మాకే వచ్చేటట్లు చూసేవాళ్లు. అలాంటి మంచివ్యక్తిని సీబీఐ పట్టుకోవడమేంటి సార్..?"

రైల్వే సంబంధిత పనులు చేపట్టే ఓ కాంట్రాక్టర్ చెప్పిన మాట ఇదీ.. సదరు కాంట్రాక్టర్.. తనకు రావాల్సిన పనులు ఆగిపోతాయేమోనన్న ఆందోళనతో చెప్పినా.. వాల్తేరు డీఆర్‌ఎం వ్యవహారమేంటనేది ఈ వ్యాఖ్యలే స్పష్టం చేస్తున్నాయి.

వాల్తేరు డివిజనల్ రైల్వే మేనేజర్ సౌరభ్‌కుమార్ ప్రసాద్.. ముంబైలో శనివారం ఉదయం లంచం తీసుకుంటూ సీబీఐకి పట్టుబడిన విషయం తెలిసిందే. డీఆర్‌ఎంపై దర్యాప్తు బృందం దాడితో వాల్తేరు డివిజన్ రైల్వే అధికారులు, ఉద్యోగులు ఉలిక్కి పడుతున్నారు. డీఆర్‌ఎం వ్యవహారాలు చక్కబెట్టే ఉద్యోగులు తమ పరిస్థితేంటనే ఆందోళనలో ఉన్నారు.

- లంచాలకు అలవాటుపడిన డీఆర్‌ఎం
- ప్రతి టెండర్‌కు పచ్చనోటు ఇవ్వాల్సిందే
- రెండేళ్ల నుంచి డీఆర్‌ఎంపై నిఘా పెట్టిన సీబీఐ
- ఆది నుంచీ లంచాల ఆరోపణలే..
- సరైన సమయం కోసం ఎదురు చూసిన వైనం
- సీబీఐ విసిరిన వలలో చిక్కుకున్న సౌరభ్‌కుమార్
- డీఆర్‌ఎం వ్యవహారాలు చూసే ఉద్యోగుల్లో ఉలికిపాటు



డీఆర్‌ఎం కార్యాయలం

సాక్షి, విశాఖపట్నం: డీఆర్‌ఎం సౌరభ్‌పై సీబీఐ గతంలో కూడా దాడులు నిర్వహించినట్టు సమాచారం. గతంలో వాల్తేరు డీఆర్‌ఎంగా రాకముందు సెంట్రల్ రైల్వే జోన్‌లో ప్రిన్సిపల్ చీఫ్ మెకానికల్ ఇంజినీర్ (పీసీఎంఈ)గా విధులు నిర్వర్తించేవారు. ఈయనకు ముందు పీసీఎంఈగా వ్యవహరించిన అధికారి.. రూ.లక్ష లంచం తీసుకుంటూ సీబీఐకి చిక్కారు. అనంతరం నిర్వహించిన సోదాల్లో రూ.23 లక్షలు, రూ.40 లక్షల విలువైన ఆభరణాలు, రూ.13 కోట్ల విలువైన ఆస్తులు, సింగపూర్, యూఎస్ బ్యాంకుల్లో రూ.1.63 కోట్ల డిపాజిట్లు ఉన్నట్లుగా సీబీఐ అధికారులు గుర్తించారు. ఆయన స్థానంలో పీసీఎంఈగా విధుల్లోకి వెళ్లిన సౌరభ్‌పై అప్పటి నుంచి కేంద్ర దర్యాప్తు బృందం నిఘా పెట్టింది. పలుమార్లు చిక్కినట్లే చిక్కి తప్పించుకున్నట్లు సమాచారం.

వైజాగ్ నుంచి ఫాలో చేస్తూ..

టెండర్ పాస్ చేసేందుకు లంచం అడుగుతున్నారంటూ ఓ కాంట్రాక్టర్ సీబీఐని ఆశ్రయించారు. దీంతో విశాఖ నుంచి దర్యాప్తు బృందం అధికారులు డీఆర్‌ఎం కదలికలపై నిఘాపెట్టారు. ముంబై వెళ్తున్నట్లు సమాచారం తెలుసుకొని అక్కడ బృందాల్ని అలెర్ట్ చేసినట్లు తెలుస్తోంది. అక్కడ కాంట్రాక్టర్ నుంచి లంచం తీసుకోవడం.. మెర్సిడెస్ కారులో ఇంటికి వెళ్లిన వెంటనే సీబీఐ అధికారులు డీఆర్‌ఎంను అదుపులోకి తీసుకోవడం చకచకా జరిగిపోయాయి. రెండేళ్ల నుంచి నిఘా కొనసాగించిన సీబీఐ అధికారులకు ఎట్టకేలకు శనివారం చిక్కారని సమాచారం. సీబీఐ అధికారులు అధికారికంగా ప్రకటించాల్సి ఉంది.

పనిని బట్టి వసూలు

లంచం వ్యవహారంలో సౌరభ్ చిక్కడంతో.. ఆయన చేసిన అవినీతి వ్యవహారాలు ఒక్కొక్కటిగా బయటకు వస్తున్నాయి. కాంట్రాక్టర్లతో నిరంతరం..డీఆర్‌ఎం కార్యాలయం బిజీ బిజీగా ఉండేదని తెలుస్తోంది. సివిల్, మెకానికల్ విభాగాలకు సంబంధించి టెండర్ల ద్వారా వచ్చిన డబ్బుల వసూళ్లకు డీఆర్‌ఎం కార్యాలయంలోని ఇద్దరు ఉద్యోగుల్ని ప్రత్యేకంగా నియమించినట్లు సమాచారం. టెండర్లు ఎవరికి రావాలంటే.. పని విలువ బట్టి వసూళ్లు రాబట్టేవారని వాల్తేరు డివిజన్ వర్గాలు చెబుతున్నాయి. రూ.50 వేల నుంచి వసూళ్ల పర్వం మొదలయ్యేదని కొందరు కాంట్రాక్టర్లు వాపోతున్నారు. డబ్బులిచ్చిన వారికే పనులకు సంబంధించిన టెండర్లు దక్కేవనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. డీఆర్‌ఎం అండ్ కో బ్యాచ్‌పై పలుమార్లు ఉన్నతాధికారులకు కాంట్రాక్టర్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని తెలుస్తోంది.

విశాఖ రైల్వే పరువు తీసేశారు!

వాల్తేరు డివిజన్ చరిత్రలో సీబీఐ దాడుల్లో ఒక ఉద్యోగి, లేదా అధికారి పట్టుబడటం ఇదే మొదటిసారని ఉద్యోగులు చెబుతున్నారు. గతంలో డీఆర్‌ఎంలుగా వ్యవహరించిన అనూప్‌కుమార్ సత్పతి, చేతన్‌కుమార్ శ్రీవాత్సవ్.. డివిజన్ అభివృద్ధి కోసం నిరంతరం శ్రమించారని.. అనేక సంస్కరణలు తీసుకొచ్చారని అంటున్నారు. ఎక్కడా అవినీతికి తావులేకుండా.. ప్రతి అంశంలోనూ పారదర్శకంగా వ్యవహరిస్తూ.. తప్పు చేసిన ఉద్యోగులను బదిలీలు, సస్పెన్షన్లు చేసేవారని చెబుతున్నారు. సదరు సౌరభ్ వచ్చిన తర్వాత.. ఫిర్యాదులిస్తున్నా పట్టించుకోకుండా వాళ్లతో మిలాఖత్ అయిపోయేవారని కొందరు ఆరోపిస్తున్నారు. మొత్తంగా సీబీఐ వ్యవహారంతో విశాఖ రైల్వే డివిజన్‌పై మచ్చ పడిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆ ఇద్దరిలో టెన్షన్

డీఆర్‌ఎంపై సీబీఐ దాడులతో.. డివిజన్‌లో ఉద్యోగుల్లో భయాందోళనలు మొదలయ్యాయి. డీఆర్‌ఎం వ్యవహారాలు చక్కబెట్టిన ఇద్దరు ఉద్యోగులు.. సెలవుపై వెళ్లిపోయేందుకు ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. అయితే.. సెలవులో వెళ్తే.. సీబీఐ దృష్టిలో పడతారంటూ సహచరులు చెప్పడంతో ఏం చెయ్యాలో పాలుపోక ఎప్పుడు తమని సీబీఐ విచారణకు పిలుస్తారోనంటూ బిక్కుబిక్కుమంటున్నారు.

క్లుప్తంగా

అక్రమ క్వారీలపై చర్యలు తీసుకోవాలి


ఎరుకునాయుడు మెట్టపై నల్ల రాయి క్వారీని పరిశీలిస్తున్న సీపీఎం నాయకుడు వెంకన్న

దేవరాపల్లి: మండలంలో అక్రమంగా క్వారీలు చేపడుతున్న నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు డి.వెంకన్న డిమాండ్ చేశారు. మారేపల్లిలో పంచాయతీ ఎరుకునాయుడు మెట్టపై చేపడుతున్న నల్లరాయి క్వారీని ఆదివారం ఆయన పరిశీలించారు. మండలంలోని వాకపల్లి, చినగంగవరం, మారేపల్లి ప్రాంతాలలో అనుమతులు లేకుండా క్వారీలను ఏర్పాటు చేసి కొండలను గుల్ల చేస్తున్నారని ధ్వజమెత్తారు. మైనింగ్ అధికారులు మామూళ్లకు ఆశపడి చూసీ చూడనట్టు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. అక్రమ క్వారీలతో ప్రజల ప్రాణాలు గాలిలో కలిసి పోతున్నాయన్నారు. మాడుగుల మండలం అవురువాడ పంచాయితీ సీతబంద గ్రానైట్ క్వారీలో ట్రాక్టర్ బోల్తాపడి యువకుడు మరణిస్తే అర్ధరాత్రి వరకు ఎటువంటి చర్యలు చేపట్టకపోవడమే ఇందుకు నిదర్శనమన్నారు. మారేపల్లి నల్లక్వారీ చుట్టూ పశువుల పాకలు ఉన్నప్పటికీ బాంబ్ బ్లాస్టింగ్‌లు చేపడుతున్నారని, ఈ శబ్దాలకు ప్రజలు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారన్నారు. ప్రమాదాలు జరిగినప్పుడు హడావుడి చేయడం కంటే ముందస్తుగా అధికారులు దాడులు చేసి, చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. మారేపల్లి అక్రమ క్వారీపై కలెక్టర్‌కు సోమవారం ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

నిస్సహాయ స్థితిలో ఉన్న యువకుడికి సాయం


గణేష్ కుటుంబానికి రూ.25 వేల చెక్కు అందిస్తున్న చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు

యలమంచిలి రూరల్: బ్రెయిన్ స్ట్రోక్‌తో కాళ్లు, చేతులు చచ్చుబడి మంచానికే పరిమితమైన నిరుపేద యువకుడి కుటుంబానికి రూ.25 వేల ఆర్థిక సాయం చేసి ఆదుకున్నారు స్థానిక మనం చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు. పట్టణంలోని ధర్మవరం వీధికి చెందిన గొన్నాబత్తుల గణేష్(28) కొద్ది రోజుల క్రితం తీవ్ర అనారోగ్యం బారిన పడ్డాడు. పక్షవాతం రావడంతో కదల్లేని స్థితికి చేరుకున్నాడు. ఆయన తల్లి రోజువారీ కూలి పనులు చేస్తూ కుమారుడికి సపర్యలు చేస్తోంది. దీంతో ట్రస్ట్ ప్రతినిధులు రూ.25 వేలు సేకరించి ఆదివారం ఆ సొమ్మును బాధిత కుటుంబానికి మున్సిపల్ కమిషనర్ బీజేఎస్ ప్రసాదరాజు చేతుల మీదుగా అందించారు. ఆపదలో ఉన్న యువకుడి కుటుంబాన్ని ఆదుకున్న ట్రస్ట్ ప్రతినిధులను కమిషనర్ ఈ సందర్భంగా అభినందించారు. గణేష్‌కు వికలాంగుల పింఛన్ మంజూరుకు కృషి చేస్తానని కమిషనర్ చెప్పారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ అధ్యక్షుడు మురుకుర్తి గోపి, వ్యవస్థాపక కార్యదర్శి పండూరి సురేష్, సీహెచ్.శ్యామలరావు, సభ్యులు కర్రి వీరునాయుడు మాస్టారు, నగిరెడ్డి భాస్కర్రావు, నగిరెడ్డి గణేష్, ముప్పిన ప్రసాద్, నగిరెడ్డి ప్రసాద్ పాల్గొన్నారు.

పర్యాటక శోభితం

- కార్తీక శోభతో పిక్నిక్ స్పాట్‌లు కళకళ
- సందర్శకులను కట్టిపడేస్తున్న సుందర దృశ్యాలు


రేబాకలోని గూడుపమ్మతల్లి ఆలయ ప్రాంగణం


పాయకరావుపేట తాండవ నది ఒడ్డున ఉన్న కట్రాళ్లకొండ ఆలయం

నక్కపల్లి : జిల్లాలో పర్యాటక ప్రాంతాలకు కొదవ లేదు. జలపాతాలు, సెలయేర్లు, ప్రాచీన కట్టడాలు, ప్రసిద్ధ పుణ్య క్షేత్రాలు.. ఇలా చెప్పుకుంటే పోతే కోకొల్లలు. కార్తీక మాసం కావడంతో ఆ ప్రాంతాలు పిక్నిక్ స్పాట్‌లు విరాజిల్లుతున్నాయి. కార్తీక వనభోజనాలతో సందడిగా దర్శనమిస్తున్నాయి.

రేబాక గూడుపమ్మతల్లి ఆలయం

నక్కపల్లి మండలంలో ఉద్దండపురం జాతీయ రహదారి నుంచి 10 కిలోమీటర్ల దూరంలో రేబాక గ్రామంలో ఆలయం ఉంది. చుట్టూ ఎత్తయిన కొండలు, పచ్చని వాతావరణం చూస్తే ఏజెన్సీని తలపిస్తుంది. ఇక్కడ పిక్నిక్ కోసం దూర ప్రాంతాల నుంచి చాలా మంది వచ్చి సందడి చేస్తున్నారు. ఉద్దండపురం, తుని, పాయకరావుపేటల నుంచి ఆటోలు తిరుగుతాయి. గుల్లిపాడు రైల్వేస్టేషన్ నుంచి కూడా రేబాక చేరుకోవచ్చు.

ఒడ్డిమెట్ట లక్ష్మీగణపతి ఆలయం

ఇక్కడ కైలాసగిరిపై లక్ష్మీగణపతి ఆలయం, కాశీవిశ్వేశ్వర ఆలయం, నవగ్రహ ఆలయం, లక్ష్మీనారాయణ ఆలయాలు ఉన్నాయి. చుట్టూ పచ్చని పంట పొలాలు ఆహ్లాదకరంగా ఉంటాయి. ఇది కూడా పిక్నిక్‌లకు అనుకూలమైన ప్రాంతమే.

తాండవ నది ఒడ్డున కట్రాళ్లకొండ

తాండవ నదికి ఆనుకుని తుని ఆర్టీసీ కాంప్లెక్స్ వెనుక భాగంలో కట్రాళ్లకొండ ఉంది. ఇక్కడ ప్రాచీన శివాలయం, అయ్యప్ప స్వామి ఆలయం ఉన్నాయి. చుట్టూ పచ్చని తోటలు తాండవ తీర ప్రాంతం ఉండడంతో పిక్నిక్‌ల నిర్వహణకు చాలా మంది మక్కువ చూపుతున్నారు. తాండవ నదిలో స్నానమాచరించి శివుడ్ని దర్శించుకోవచ్చు. తుని, పాయకరావుపేటల నుంచి కాలినడకన కూడా చేరుకోవచ్చు.

గోపాలపట్నంవద్ద సీతమ్మవారి మెట్ట...


పాయకరావుపేట మండలంలో గోపాలపట్నం వద్ద సీతమ్మవారి మెట్ట ఉంది. ఇది కూడా పవిత్ర పుణ్యక్షేత్రం. ఉమాధర్మలింగేశ్వరస్వామి ఆలయంతో పాటు పర్యాటకపరంగా కూడా ప్రసిద్ధిగాంచింది. కొండపై ఆహ్లాదకరమైన వాతావరణం ఉంటుంది. ఇక్కడ ఉన్న కొలనులో స్నానమాచరిస్తే పుణ్యం వస్తుందని భక్తుల నమ్మకం.

నామవరంలో స్వయంభూ రామలింగేశ్వర ఆలయం

జాతీయ రహదారికి ఆనుకుని నామవరం వద్ద స్వయంభూ రామలింగేశ్వర స్వామి ఆలయం ఉంది. పచ్చని కొబ్బరి తోటల మధ్య ఉన్న ఈ ఆలయం పిక్నిక్‌లకు ఎంతో అనువుగా ఉంటుంది.

మూడు నదుల సంగమం


మూడు నదులు కలిసిన మేజర్ శారదా నది ఒడ్డు


సంగమేశ్వరస్వామి ఆలయం

చోడవరం: మూడు పవిత్ర నదులు కలిసిన ప్రదేశంలో ఉన్న ముద్దుర్తి సంగమేశ్వరస్వామి ఆలయానికి 900 ఏళ్లనాటి చరిత్ర ఉంది. చోడవరం మండలం ముద్దుర్తి గ్రామ శివారు నదీ పరివాహకంలో రాతి కట్టడంతో నిర్మించిన ఈ ఆలయానికి ఎంతో విశిష్టత ఉంది. ఇక్కడ పవిత్ర పుణ్యస్నానాలు ఆచరించేందుకు స్నాన ఘట్టాలు కూడా ఉన్నాయి. జిల్లాలో అతిపెద్ద నదులైన శారదా, పెద్దేరు, బొడ్డేరు నదులు సంగమంగా ఏర్పడిన ప్రదేశంలో ఈ ఆలయం ఉండడం వల్ల సంగమేశ్వరస్వామిగా ఇక్కడి మహా లింగాన్ని పూజిస్తారు.ఇటీవల ఆలయ పునర్నిర్మాణ సమయంలో గోపురం కలశం నుంచి బయటపడిన నాణేలపై 78 అనే సంఖ్య ఉండడాన్ని బట్టి ఈ ఆలయం అత్యంత పురాతనమైనదిగా భావిస్తున్నారు. కార్తీక మాసంలో నదుల సంగమం వద్ద స్నానం చేస్తే పవిత్రత ఉంటుందని భక్తుల నమ్మకం. ఆలయ సమీపంలో ఉన్న జీడి, మామిడి తోటలు వనసమారాధనలతో కళకళలాడుతున్నాయి.

కార్తీక మాసం స్పెషల్


మదిని దోచే సరుగుడు జలపాతం


సరుగుడు జలపాతం వద్ద సందర్శకుల సందడి


జలపాతానికి వెళ్లేందుకు వేసిన రోడ్డు

నాతవరం: మండలంలో సరుగుడు గ్రామ సమీపంలోని జలపాతం సందర్శకులను కట్టిపడేస్తోంది. కొండల మధ్య నుంచి సుమారుగా 50 అడుగుల ఎత్తులోంచి జారిపడుతున్న నీటి పరవళ్లు మదిని దోచేస్తున్నాయి. పర్యాటకుల సంఖ్య పెరగడంతో ఇటీవల ఈ ప్రాంతాన్ని పర్యాటక శాఖాధికారులు రూ.10 లక్షల వ్యయంతో పలు మౌలిక వసతులు కల్పించారు. జలపాతం వద్ద స్నానాలు అనంతరం దుస్తులు మార్చుకునేందుకు వీలుగా ప్రత్యేకంగా షెడ్లు నిర్మించారు. సందర్శకులు కొండల పైనుంచి జారి పడే జతపాతం వద్దకు వెళ్లేందుకు ప్రత్యేకంగా మెట్లతో పాటు ఐరన్ గ్రిల్స్ ఏర్పాటు చేశారు. కొండపై వినాయకుడు, పార్వతీపరమేశ్వర్లు, పక్కనే నంది విగ్రహాలతో పాటు శివలింగం కనువిందు చేస్తున్నాయి. జలపాతం చేరుకునేందుకు వీలుగా ఇటీవల కొత్తగా తారురోడ్డు కూడా వేశారు. జలపాతం వద్దకే వాహనాలు వెళ్తుండడంతో సందర్శకులతో ఈ ప్రాంతం నిత్యం కళకళలాడుతోంది. ప్రస్తుతం కార్తీక మాసం కావడంతో మరింత రద్దీగా దర్శనమిస్తోంది. నర్సీపట్నం నుంచి సరుగుడు 35 కిలోమీటర్ల దూరంలో ఉంది. ఉదయం నుంచి సరుగుడు గ్రామం వరకు నిత్యం ఆటోలు తిరుగుతుంటాయి.

రోలుగుంట కొండలు.. ఆహ్లాదకరం


రోలుగుంట కొండల నడుమ వేంకటేశ్వరస్వామి ఆలయం

రోలుగుంట: స్థానిక కొండల నడుమ ఆహ్లాదకర వాతావరణం పర్యాటకులను కట్టిపడేస్తున్నాయి. ఈ ప్రాంతానికి దిగువన కోనేరు చెంతన తూర్పున కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయం , పడమరన కొండ ఎగువన సత్యన్నారాయణస్వామి ఆలయం, ఉత్తరాన వేంకటేశ్వర ఆలయం, దక్షిణాన కొండ ఎగువన జగ్గారాయుడు గుడి.. ఇలా నలువైపులా నాలుగు ఆలయాలున్నాయి. మండలవాసులే కాకుండా నర్సీపట్నం, కొత్తకోట, మాకవరపాలెం, తదితర ప్రాంతాల నుంచి ఇక్కడికి పిక్నిక్‌ల కోసం అధిక సంఖ్యలో తరలివస్తుంటారు. ఆహ్లాదకర వాతావరణంతో పాటు ఆధ్యాత్మికతతో ఈ ప్రాంతం ఆకట్టుకుంటోంది.

సీపీఎస్ రద్దుపై మీనమేషాలు తగదు

- ఏకీకృత సర్వీసుపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు
- ప్రభుత్వ తీరుమారకుంటే ఉద్యమాలకు సిద్ధం
- ఎస్టీయూ రాష్ట్ర కార్యదర్శి రఘునాథరెడ్డి

విశాఖ విద్య: ఉద్యోగ, ఉపాధ్యాయులకు బకాయిలను తక్షణమే చెల్లించేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు రఘునాథరెడ్డి డిమాండ్ చేశారు. నగరంలోని ఓ హోటల్‌లో ఆదివారం జరిగిన ఎస్టీయూ ఉత్తరాంధ్ర జిల్లాల ముఖ్య బాధ్యుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 11వ పీఆర్సీ, డీఏ, సరెండర్ లీవ్ బకాయిలు, పీఎఫ్, ఏపీజీఎల్ఐ తుది చెల్లింపులు, రుణాల చెల్లింపులపై ప్రభుత్వం ఇంతవరకు స్పందించకపోవడం శోచనీయమన్నారు. ముఖ్యమంత్రి వెంటనే ఉద్యోగ ఉపాధ్యాయ సంఘాలతో చర్చించి ఎప్పటిలోగా బకాయిలు చెల్లిస్తారో ప్రకటించాలని డిమాండ్ చేశారు. 12వ పీఆర్సీ అమలు చేయవలసిన గడువు ఇప్పటికే 17 నెలలు ఆలస్య మైందని.. వెంటనే 30 శాతం మధ్యంతర భృతి ప్రకటించి పీఆర్సీ కమిటీని ఏర్పాటు చేయాలన్నారు. ఉపాధ్యాయులకు బోధనేతర కార్యక్రమాల భారం తగ్గిస్తామన్న ప్రభుత్వం ఆచరణలో చూపడం లేదన్నారు. పాఠశాలలో అమలు చేస్తున్న బోధనేతర కార్యక్రమాలు, యాప్‌లతో ఉపాధ్యాయులకు మానసిక ప్రశాంతత కరువైందన్నారు. ఏకీకృత సర్వీస్ రూల్స్ సమస్యను పరిష్కరించాలన్న చిత్తశుద్ధి కనిపించడం లేదన్నారు. సీపీఎస్ రద్దు పై అందరికీ ఆమోదయోగ్యమైన నిర్ణయం తీసుకుంటామన్న ప్రభుత్వం ఆ దిశగా ఇంతవరకు ఎటువంటి చర్యలు చేపట్టలేదన్నారు. కేంద్ర ప్రభుత్వ ఉత్తర్వులు మెమో నం.57 మేరకు 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ వర్తింప చేయాల్సి ఉండగా.. ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తుందన్నారు. 1998, 2008 డీఎస్సీ ఎంటీఎస్ ఉపాధ్యాయులకు 62 ఏళ్ల పదవీ విరమణ వయసు, ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. ప్లస్ టు పాఠశాలలను ప్రారంభించి ఉపాధ్యాయులను మాత్రం నియమించలేదన్నారు. పురపాలక ఉన్నత పాఠశాలల్లో ఎస్జీటీ తత్సమాన పోస్టులను వెంటనే ఉన్నతీకరించాలన్నారు. డీఎస్సీ వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. విద్యారంగ సమస్యలపై, ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షనర్ల ఆర్థిక బకాయిలపై ప్రభుత్వం స్పందించకపోతే ఎస్టీయూ ఆధ్వర్యంలో ఉద్యమానికి శ్రీకారం చుడతామన్నారు. రాష్ట్ర కార్యదర్శి డి.శ్యాం, ఉత్తరాంధ్ర జిల్లాల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు దేముడు బాబు, ఇమంది పైడిరాజు, రమణమూర్తి, తమ్మి నాయుడు, కె.జోగారావు, సూరిబాబు, రవి, పరదేశి, వరలక్ష్మి, పురుషోత్తం, సీనియర్ నాయకులు జగదీష్ బాబు పాల్గొన్నారు.

కార్యకర్తలకు నిత్యం అందుబాటులో ఉంటా

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్


వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి ప్రసాద్‌ను సత్కరిస్తున్న పార్టీ నేతలు

మునగపాక: కార్యకర్తలకు ఎటువంటి కష్టం వచ్చినా నిత్యం అందుబాటులో ఉంటానని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్ హామీ ఇచ్చారు. ప్రజా సమస్యల పరిష్కారానికి రాజీలేని పోరాటం చేసేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. రాష్ట్ర కార్యదర్శిగా నియమితులైన ప్రసాద్‌ను ఆదివారం పార్టీ శ్రేణులు క్యాంపు కార్యాలయంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయాలన్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కక్ష సాధింపు చర్యలకు దిగుతుందన్నారు. రాష్ట్ర కార్యదర్శిగా నియమించిన పార్టీ అధినేత, మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి, ఉత్తరాంధ్ర కన్వీనర్ విజయసాయిరెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కష్టపడి పని చేసే వారికి పార్టీలో తగిన గుర్తింపు ఉంటుందన్నారు. పార్టీ మండల నేత నరాలశెట్టి సూర్యనారాయణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు, దాసరి అప్పారావు, దొడ్డి వరహా సత్యనారాయణ, దిమ్మల అప్పారావు, కాండ్రేగుల నూకరాజు, శరగడం జగన్నాథరావు, కోనపల్లి రామ్మోహనరావు, కాండ్రేగుల జగన్, చీరా రమణమ్మ, ఇల్లా నాగేశ్వరరావు, మద్దాల వీరునాయుడు, సూరిశెట్టి రాము, బాబూరావు, నాగేశ్వరరావు, గుంట్ల అప్పారావు, రాజాన బుజ్జి, తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలులో ప్రభుత్వాలు విఫలం



కోనాం సమావేశంలో మాట్లాడుతున్న ప్రభావతి

చీడికాడ: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమయ్యాయని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యురాలు బి.ప్రభావతి విమర్శించారు. ఆదివారం మండలంలోని కోనాం శివారు కొండ్లకొత్తూరు సీపీఎం చీడికాడ మండల మహాజన సభ జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగిపోయి ప్రజలకు గుదిబండగా మారాయన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను తుంగలోకి తొక్కిందన్నారు. మహిళలపై అఘాయిత్యాలు పెరిగాయని ఆమె మండిపడ్డారు. ఉచిత ఇసుక విధానం ఎక్కడా అమలు కాలేదన్నారు. రూ.11 వేల కోట్లు విద్యుత్ చార్జీల(ట్రూ అప్ చార్జీలు) భారం ప్రజలపై మోపారని ధ్వజమెత్తారు. కేంద్ర ప్రభుత్వం పెట్టుబడిదారులకు రాయితీలు ఇస్తూ సామాన్యులపై భారాలు మోపుతోందని ఆరోపించారు. ప్రజా కంటక విధానాలపై ప్రజా పోరాటాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు ఆర్.శంకరరావు, సిహెచ్.శ్రీనివాసరావు, కె.కన్నబాబు, జి.ఈశ్వరరావు, చిన్నబ్బాయి, రాము, ఆర్.దేముడునాయుడు పాల్గొన్నారు.

జూ ఆదాయం రూ.7.64 లక్షలు


జూ ప్రధాన ద్వారం వద్ద సందర్శకులు సందడి


సీతాకోక చిలుకల పార్కు వద్ద సందడి చేస్తున్న పిల్లలు

ఆరిలోవ: కార్తీకమాసం మూడో ఆదివారం జూ పార్కు.. సందర్శకులతో కిటకిటలాడింది. పిల్లలు, పెద్దలు వన్యప్రాణులను తిలకించడంతో పాటు ఆటపాటలతో సరదాగా గడిపారు. వివిధ రకాల పక్షులు, నల్ల హంసలు, ఖడ్గమృగం, కోతులు, ఏనుగులు, పులులు, జిరాఫీలు, చింపాంజీలు, పాములు సందర్శకులను అలరించాయి. వీటి వద్ద సందర్శకులు సెల్ఫీలు తీసుకున్నారు. చెట్ల కింద, షెల్టర్లలో కుటుంబ సమేతంగా వనభోజనాలు చేశారు. జాతీయ రహదారి పక్కన ప్రధాన ద్వారం, బీచ్‌రోడ్డులో సాగర్ ద్వారం నుంచి ఆదివారం ఒక్క రోజు 10,006 మంది సందర్శించినట్లు జూ ఇన్‌చార్జి క్యూరేటర్ జి.మంగమ్మ తెలిపారు. సందర్శకులతో పాటు లోపలకు ప్రవేశించిన కార్ల ద్వారా రూ.7,64,640 ఆదాయం లభించినట్లు ఆమె వెల్లడించారు.

కంబాలకొండకు రూ.65 వేలు..

కంబాలకొండ ఎకో టూరిజం పార్కు ఆదివారం సందర్శకులతో కళకళలాడింది. ఇక్కడ చెట్ల కింద సందర్శకులు వనభోజనాలు చేశారు. విశాలమైన మైదానాల్లో రోజంతా ఆటలతో సరదాగా గడిపారు. ఆట పరికరాల వద్ద పిల్లలు సందడి చేశారు. కంబాలకొండను ఆదివారం 900 మంది సందర్శించినట్లు నిర్వాహకులు తెలిపారు. వారి ద్వారా రూ.65,000 ఆదాయం లభించిందన్నారు.

చికిత్స పొందుతూ మృతి

అనకాపల్లి: స్థానిక ఎన్టీఆర్ ఆస్పత్రి సమీపంలోని ఎల్లయ్య కాలువలో ద్విచక్ర వాహనంతో పడిన పరవాడ మండలం కలపాక గ్రామానికి చెందిన యర్ర శ్రీనివాసరావు (33) తలకు తీవ్ర గాయమైంది. స్థానికుల సహకారంతో పక్కనే ఉన్న ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం కేజీహెచ్‌కు తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ ఆదే రోజు రాత్రి మృతి చెందాడు. ఈ మేరకు మృతుడి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ట్రాఫిక్ ఎస్ఐ డి.శేఖరం తెలిపారు.

కత్తితో దాడి చేసిన ముగ్గురిపై కేసు నమోదు


వై.రమేష్‌నాయుడి వీపుపై కత్తిగాటు


అనకాపల్లి ఆస్పత్రిలో రమేష్‌నాయుడుతో మాట్లాడుతున్న ఎస్ఐ ఈశ్వరరావు

అనకాపల్లి: ఇళ్ల మధ్య గోడ విషయంలో జరిగిన ఘర్షణలో వై.రమేష్‌నాయుడిని అదే ప్రాంతానికి చెందిన బి.రాజా కత్తితో పొడిచినట్లు పట్టణ పోలీసులకు ఆదివారం ఫిర్యాదు అందింది. ఎస్ఐ ఈశ్వరరావు కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. విశాఖ నగరం మద్దిపాలేనికి చెందిన వై.రమేష్ నాయుడు కుటుంబ సమేతంగా అనకాపల్లి గవరపాలెంలో ఓ ఫంక్షన్‌కు వెళ్లారు. ఈయనకు గవరపాలెం గంగిరెగిచెట్టు వద్ద సొంతిల్లు ఉంది. ఈ పక్కనే ఉన్న బి.రాజా, ఈయనకు గోడ విషయంలో ఘర్షణ జరిగింది. రమేష్‌ను రాజా కత్తితో వీపుపై పొడిచి గాయపరిచాడు. రాజాతో పాటు సంతోష్, పూర్ణచంద్రరావు కూడా ఈ ఘర్షణలో ఉన్నట్లు చెప్పారు. బాధితుడిని వెంటనే చికిత్స నిమిత్తం ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

డాక్టర్ గాయత్రీదేవికి యశస్విని పురస్కారం


గాయత్రీదేవికి యశస్విని పురస్కారం అందజేస్తున్న నిర్వాహకులు

నక్కపల్లి: విశ్రాంత తెలుగు పండిట్, అభినవ మొల్ల, ప్రముఖ రచయిత్రి డాక్టర్ గొట్టుముక్కల గాయత్రీదేవికి హైదరాబాద్‌కు చెందిన యశస్విని సాహితీ సమితి వారు యశస్విని పురస్కారం అందజేశారు. ఉపమాక వేంకటేశ్వర స్వామి కల్యాణోత్సవాల్లో పెండ్లి మాటల తంతు, కన్యావరుణ సంవాదం కార్యక్రమాలకు వ్యాఖ్యాతగా వ్యవహరిస్తున్న గాయత్రీదేవి సాహిత్యరంగంలో ఎన్నో గ్రంథాలు రచించారు. ఆదివారం హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో జరిగిన కార్యక్రమంలో ఈ పురస్కారాన్ని అందుకున్నట్టు గాయత్రీదేవి తెలిపారు. తెలంగాణా పూర్వ సాంస్కృతిక సలహాదారుడు కేవీ రమణాచారి, తదితరుల సమక్షంలో ఆమె ఈ పురస్కారాన్ని స్వీకరించారు.

నకిలీ నోట్ల చలామణి ముఠా అరెస్ట్


నిందితుల నుంచి స్వాధీనం చేసుకొన్న నకిలీ ఐదు వందల నోట్లు

పరవాడ: లంకెలపాలెం ప్రాంతంలో నకిలీ కరెన్సీని చలామణి చేస్తున్న నలుగురిని పరవాడ పోలీసులు ఆదివారం అరెస్ట్ చేశారు. పరవాడ సీఐ ఆర్.మల్లికార్జునరావు అందించిన వివరాలివీ.. కోనసీమ జిల్లా ముమ్మిడివరానికి చెందిన గుత్తుల విశాల్.. అతని మామయ్య శీలం శ్రీనుతో కలిసి ఈ నెల 16న వ్యానులో కొబ్బరి బొండాల లోడుతో బయలుదేరారు. ఎస్ఏడీ కొత్త రోడ్డులో ఆదివారం తెల్లవారుజామున 3.30 గంటలకు అన్‌లోడ్ చేశారు. తిరుగు ప్రయాణంలో లంకెలపాలెం కూడలిలో టీ తాగడానికి సాయంత్రం 4.30 గంటలకు ఆగారు. ఆ సమయంలో అక్కడకు అనకాపల్లి మండలం విజయరామరాజపేటకు చెందిన ఒమ్మి భానుప్రకాష్, వై.ఆదర్శ్, పెదరెల్లి వీధికి చెందిన పాట్నూరు హరిచంద్రప్రసాద్, విజయనగరం జిల్లా రాజాం మండలం బురడకు చెందిన తీగల క్రాంతికుమార్ వచ్చారు. రూ.500 నోటుకు చిల్లర అడిగారు. అది నకిలీ నోటు అని గమనించక విశాల్ చిల్లర ఇచ్చాడు. ఇదే అదనుగా భావించిన ఆ వ్యక్తులు మరో నాలుగు నకిలీ రూ. 500 నోట్లు ఇచ్చి చిల్లర ఇవ్వమని కోరగా.. వాటికి కూడా విశాల్ చిల్లర ఇచ్చాడు. వెంటనే ఆ నలుగురు అక్కడి నుంచి జారుకున్నారు. అనంతరం విశాల్ ఆ నోట్లను పరిశీలించగా.. చిల్డ్రన్ బ్యాంకు ఆఫ్ ఇండియా అని ముద్రించి ఉండటం గమనించాడు. వెంటనే పరవాడ పోలీసులను ఆశ్రయించారు. సీఐ ఆర్.మల్లికార్జునరావు ఆధ్వర్యంలో ఎస్ఐ బి.కృష్ణారావు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఆ నలుగురు ముఠా సభ్యులను మంత్రిపాలెం జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీలో ఆదివారం సాయంత్రం అరెస్ట్ చేశారు. ఆరు నకిలీ రూ.500 నోట్లు, 20 అసలు రూ.100 నోట్లను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు.

క్లుప్తంగా

కార్డుదారులకు కందిపప్పు అందజేత



వినియోగదారులకు కందిపప్పు అందజేస్తున్న దృశ్యం

అనకాపల్లి: పట్టణ పరిధిలో 10, 17 రేషన్ దుకాణాల్లో ప్రభుత్వ ఆదేశాల మేరకు బియ్యంతో పాటు, కందిపప్పు, పంచదార రేషన్ కార్డు వినియోగదారులకు అందజేసినట్లు పౌర సరఫరాల శాఖ అనకాపల్లి డిప్యూటీ తహసీల్దార్ టి.లీలా శేషుకుమారి ఆదివారం తెలిపారు. పైరెండు డిపోల రేషన్ కార్డుదారులకు కందిపప్పు ఇవ్వడం లేదని వచ్చిన సమాచారం మేరకు రెండు డిపోల్లో తనిఖీలు నిర్వహించి, అక్కడ కందిపప్పు లేక పోవడంతో గొడౌన్ నుంచి తీసుకొచ్చి ఇచ్చినట్లు తెలిపారు.

గవరపేట గౌరమ్మకు సారె సమర్పణ



గౌరమ్మ సారె ఊరేగింపులో పాల్గొన్న మహిళలు

కె.కోటపాడు : చౌడువాడ గ్రామంలో గవరపేటలో ఏర్పాటు చేసిన గౌరమ్మకు ఆదివారం రాత్రి పిండి వంటలతో చేసిన సారెను సమర్పించారు. పెద్ద సంఖ్యలో మహిళలు అమ్మవారికి తయారు చేసిన బూరెలు, రవ్వ లడ్డూ, కాజా తదితర స్వీట్లతో పాటు పండ్లను తలపై ఉంచి ఊరేగింపు నిర్వహించారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ



కె.జె.పురంలో పేదలకు దుప్పట్లు అందజేస్తున్న దృశ్యం

మాడుగుల రూరల్: కె.జె.పురం గ్రామంలో ఆదివారం పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన విశ్రాంతి ఉద్యోగి పాలకుర్తి మోహన్‌రావు ఆయన భార్య కుసుమ జ్ఞాపకార్థం 67 మందికి వార్డు సచివాలయ కార్యదర్శి జి.నాగేశ్వరరావు వీటిని అందజేశారు.

మారిన వాతావరణం.. రైతుల్లో ఆందోళన

చీడికాడ: ఆకాశం రెండు రోజులుగా మేఘావృతమై కనిపించడంతో కోనాం జలాశయం ఆయకట్టు, మెట్ట గ్రామాల రైతులు ఆందోళన చెందుతున్నారు. వరి చేలను గడిచిన రెండు రోజులుగా రైతులు కోసి పొలాల్లో ఆరబెట్టారు. ఆదివారం ఉదయం నుంచి ఆకాశమంతా మబ్బులు కమ్మడంతో వర్షం కురుస్తుందేమోనని రైతుల్లో ఆందోళన నెలకొంది.

అనకాపల్లి సినిమాలు

దేవర	: రాజా
'క'	: సత్యనారాయణ స్క్రీన్-1
అమరాన్	: సత్యనారాయణ స్క్రీన్-2
కంగువ	: పర్తిసాయి
మట్కా	: షిర్డిసాయి
గ్లాడియేటర్	: వెంకటేశ్వర
విశ్వం	: శ్రీసత్య
లక్కీ భాస్కర్	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 28 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-4 యూనిట్లు, బీ పాజిటివ్-9 యూనిట్లు, ఓ పాజిటివ్-14 యూనిట్లు, ఏబీ పాజిటివ్-1 యూనిట్ శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు టెక్నీషియన్ లోకేష్ (9703619706) నంబరులో సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా ఆదివారం 211 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 139 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధిని 08924-223595 నంబరులో సంప్రదించవచ్చు.

వంట నూనెల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. పండగలు, గృహాల్లో జరిగే శుభ కార్యాల్లో వివిధ రకాలైన పిండి వంటలకు ఉపయోగించే నూనెల ధరలకు రెక్కలు వచ్చాయని సామాన్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొద్ది రోజులుగా స్థిరంగా ఉన్న నూనెల ధరలు మరోసారి భగ్గుమన్నాయి. ఈ ఏడాది సెప్టెంబర్ నుంచి నూనెల ధరలు పెరుగుతున్నాయని ప్రజలు వాపోతున్నారు.

ఆకాశాన్నంటుతున్న.. వంట నూనెల ధర

- గగ్గోలు పెడుతున్న ప్రజలు
- నెలకు రూ.10 కోట్ల నుంచి రూ. 8 కోట్లకు పడిపోయిన వ్యాపారం

ధరల పెరుగుదల ఇలా..

- పామాయిల్ 15 లీటర్ల డబ్బా ప్రస్తుతం రూ.2100 ఉంది. సెప్టెంబర్ మాసానికి ముందు రూ.1700 ఉండేది.
- సన్‌ఫ్లవర్ 15 లీటర్ల డబ్బా ప్రస్తుతం రూ.2300 ఉంది. సెప్టెంబర్ మాసానికి ముందు రూ.1900 ఉండేది.
- 5 లీటర్ల డబ్బాలు, లీటర్ ప్యాకెట్ ధరలు కూడా పెరిగాయి.



సామాన్యులకు అందనంటున్న వంట నూనె

అనకాపల్లి: పట్టణ పరిధిలో 6 హోల్‌సేల్ నూనె దుకాణాల్లో నెలకు సుమారు 500 టన్నుల వరకు వినియోగదారులు వాడుతున్నారు. పండగలు, గ్రామ దేవతల ఉత్సవాలు, శుభ కార్యాల సమయంలో అదనంగా మరో 100 టన్నుల నూనె వినియోగిస్తున్నారు. శుద్ధి చేసిన ఎడిబుల్ ఆయిల్‌పై కేంద్ర ప్రభుత్వం 33 శాతానికి పైగా సుంకం పెంచడంతో ధరలకు రెక్కలొచ్చాయి. నూనె గింజల పంటలు సాగు చేసే రైతుల ప్రయోజనం కోసమే ఈ నిర్ణయం అని ప్రభుత్వం చెబుతోంది. లీటర్ ఆయిల్‌పై ఏకంగా 30 శాతం ధర పెరడగంతో సామాన్యులకు ఇబ్బందికరంగా మారింది. అనకాపల్లి పట్టణానికి కాకినాడ పోర్టు నుంచి పామాయిల్, సన్‌ఫ్లవర్ ఆయిల్ ట్యాంక్‌లు, డబ్బాలు, బాటిళ్ల ద్వారా దిగుమతి అవుతోంది. ఇటీవల కురిసిన వర్షాలకు అన్నదాతకు కొద్దిపాటి నష్టం కలిగింది. కేంద్రం ముడి చమురు, శుద్ధి చేసిన చమురు దిగుమతిపై సుంకాన్ని 12 నుంచి 33 శాతానికి పెంచడంతో సామాన్యులపై ఒక్కసారిగా 21 శాతం భారం పడింది.

నూనె వ్యాపారుల కుదేలు..

కేంద్రం ఒక పక్క నూనె ధరల సుంకాన్ని పెంచడం, మరో పక్క పట్టణంలో డీ-మార్ట్ వంటి వ్యాపార కేంద్రం ఏర్పాటు కావడంతో హోల్‌సేల్, రిటైల్ దుకాణాల వద్ద కొనుగోలుదారుల శాతం రానురాను తగ్గిపోతోంది. గతంలో వంటల్లో నూనెను యథేచ్ఛగా వాడిన వారు ఇప్పుడు ఆచితూచి నూనె వాడుతున్నారు.

ధరల పెరుగుదలను నియంత్రించాలి..



మాది సామాన్య రైతు కుటుంబం. ఇప్పటికే నిత్యావసరాలైన పప్పులు, కిరాణా సామగ్రి ధరలు పెరిగాయి. అయిల్ ధరలు కూడా పెరగడంతో ఇబ్బందులు తప్పడం లేదు. ధరల పెరుగుదలను ప్రభుత్వాలు నియంత్రించాలి. నెలకు కుటుంబం అంతా 4 లీటర్లు అయిల్ వాడే వాళ్లం. ప్రస్తుతం రెండు లీటర్లు మాత్రమే వాడుతున్నాం.

– పి.కల్యాణ్, మిరియాల కాలనీ, అనకాపల్లి

ప్రభుత్వం ధరలు తగ్గించాలి



ఇప్పటికే నిత్యావసర సరకుల ధరలు బాగా పెరిగాయి. దీనికి తోడు వంట నూనెల ధరలు కూడా పెరడగంతో ఇబ్బందిగా ఉంది. గతంలో వాడినట్లు ఇప్పుడు వంట నూనెను ఇష్టానుసారం వాడలేకపోతున్నాం. ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

– వి.చంద్రరావు, వేల్పులవీధి, అనకాపల్లి

సుంకం వల్లే ధరలు పెరిగాయి



ఈ ఏడాది సెప్టెంబర్ తర్వాత ప్రభుత్వాలు నూనెపై 33 శాతం సుంకం పెంచడంతో ధరలు పెరిగాయి. ఆగస్టు వరకూ పట్టణ పరిధిలో నెలకు సుమారు రూ.10 కోట్ల నూనె వ్యాపారం జరిగేది. ప్రస్తుతం రూ.8 కోట్ల వ్యాపారమే జరుగుతుంది.

– ఎం.ఎస్.వి.చలమయ్య, హోల్‌సేల్ ఆయిల్ వ్యాపారుల సంఘం ప్రతినిధి, అనకాపల్లి

గవర సంక్షేమ సంఘం అధ్యక్షునిగా కొణతాల చంద్రశేఖర్



గవర సంక్షేమ సంఘం నూతన కార్యవర్గం

అనకాపల్లి: అనకాపల్లి గవర సంక్షేమ సంఘం అధ్యక్షునిగా కొణతాల చంద్రశేఖర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక గవరపాలెం సంఘం కార్యాలయంలో ఆదివారం జరిగిన ఎన్నికల్లో సంఘం గౌరవాధ్యక్షునిగా బుద్ద భూలోకనాయుడు, ప్రధాన కార్యదర్శిగా సూరిశెట్టి నర్సింగరావు, ఉపాధ్యక్షులుగా కాండ్రేగుల విశ్వేశ్వరరావు, పెంటకోట శ్రీనివాసరావు, పిల్లా చిన్నికృష్ణ, కార్యదర్శులుగా మళ్ల జగన్మోహనరావు, పెతకంశెట్టి శ్రీనివాసరావు, ఆడారి శేఖర్, యల్లపు శ్రీనివాసరావు, కోశాధికారిగా పిల్లా త్రినాథరావు, కార్యవర్గ సభ్యులుగా కాండ్రేగుల రామకృష్ణ, ఆడారి శ్రీనివాసరావు, కర్రి సీతా అప్పలనాయుడు, కర్రి రామకృష్ణ, సూరిశెట్టి గణేష్, కొణతాల త్రినాథ్, మళ్ల ప్రసాద్, మద్దాల జగదీష్, మారిశెట్టి శ్రీనివాసరావు, పెంటకోట నూకేష్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు కొణతాల చంద్రశేఖర్ మాట్లాడుతూ పై కమిటీ రెండు సంవత్సరాలు ఉంటుందన్నారు. ఈ ఏడాది డిసెంబర్ 22న జిల్లా వ్యాప్తంగా 20 వేల మందితో భారీ ఎత్తున వనసమారాధన కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు.

పర్యావరణ పరిరక్షణతోనే ఆరోగ్యకర జీవితం



పర్యావరణంపై అవగాహన కల్పిస్తున్న సూర్యనారాయణ

అనకాపల్లి: ప్రతి వ్యక్తి సాధ్యమైనంత వరకు ఆహ్లాదకర వాతావరణంలో జీవించాలంటే పర్యావరణ పరిరక్షణతోనే అది సాధ్యమని రామచంద్ర మిషన్ ఆశ్రమ మేనేజింగ్ డైరెక్టర్ సూర్యనారాయణ, కో ఆర్డినేటర్ మురళీమోహన్ అన్నారు. మండలంలో సంపతిపురం గ్రామంలో రామచంద్రమిషన్ వద్ద పర్యావరణ పరిక్షణపై ఆదివారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. యోగా, ధ్యానంతో పాటు ప్రకృతి సిద్ధమైన పరిసర ప్రాంతాల్లో జీవించడం మంచిదని వారు తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా రామచంద్ర మిషన్, హార్ట్‌ఫుల్‌నెస్ ఆధ్యాత్మిక సేవా సంస్థల ఆధ్వర్యంలో సుమారు 80కి పైగా ప్రాంతాల్లో గ్రీన్ హార్ట్‌ఫుల్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి రామచంద్ర మిషన్ కో ఆర్డినేటర్ జి.మంగయ్య, మాధవి, ఐఎస్ రావు తదితరులు పాల్గొన్నారు.

ఖరీఫ్ రైతులకు క'న్నీటి' కష్టాలు

- తాండవలో నిండుగా నీరున్నా శివారుకు అందని పరిస్థితి
- కాలువలో తొలగించని పూడిక
- పొట్ట దశలో నీరందకపోతే తగ్గనున్న దిగుబడులు



ప్రధాన కాలువలో నీటి ప్రవాహానికి అడ్డుగా కొమ్మలు



ములగపూడిలో నీరందని వరి చేను

నాతవరం: ఖరీఫ్ సాగు రైతులను నీటి కష్టాలు వీడడం లేదు. తాండవ రిజర్వాయరులో పుష్కలంగా నీరు ఉన్నా అందని పరిస్థితి నెలకొంది. కాలువలో పూడిక తీయకపోవడంతో శివారు ఆయకట్టు వరకు నీరు ప్రవహించడం లేదు. ఖరీఫ్ సీజన్‌లో ప్రతి ఏటా తాండవ ప్రాజెక్టు నీరుపై ఆధారపడి రెండు జిల్లాల పరిధిలో సుమారుగా 52 వేలు ఎకరాల్లో వరి పంట సాగు చేస్తుంటారు. ఈ ఏడాది ప్రకృతి కరుణించడంతో సకాలంలో ఖరీఫ్ సీజన్‌లో రైతులు వరి నాట్లు వేశారు. ఏటా ఆయకట్టుకు నీరు ప్రవహించే తాండవ కాలువలో అధికారులు పూడిక తొలగించి శుభ్రం చేసేవారు. అలాంటిది కూటమి ప్రభుత్వం తాండవ కాలువలో ఎక్కడ కూడా పూడిక పనులు చేపట్టలేదు. పిచ్చి మొక్కలు, చెట్ల కొమ్ములతో కాలువ కుదించుకుపోయింది. తాండవ ప్రాజక్టు నుంచి ఆయకట్టుకు నీరు ప్రవహించేందుకు కుడి ఎడమ రెండు పెద్ద కాలువలు ఉన్నాయి. తాండవ ఆయకట్టు అనకాపల్లి జిల్లాలో నాతవరం, కోటవురట్ల, నర్సీపట్నం మండలాలతో పాటు కాకినాడ జిల్లా కోటనందూరు రౌతులపూడి మండలాల పరిధిలో 52 వేలు ఎకరాలకు పైగా వ్యాప్తించి ఉంది. ఆయా భూములకు సాగు నీరు అందించేందుకు పెద్దా చిన్న కాలువలు కలుపుకోని మొత్తం 120 కిలో మీటర్ల పొడవున ఉన్నాయి. ఆ కాలువల్లో పూడిక తీయకపోవడంతో తాండవ ప్రాజెక్టులో పుష్కలంగా నీరు ఉన్నా శివారు ఆయకట్టు భూములకు నీరు ప్రవహించడం లేదని కోటవురట్ల, నర్సీపట్నం కోటనందూరు మండలాల రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కోటనందూరు మండలం కాకరపల్లి, అల్లిపూడి, కోటవురట్ల మండలం పాములవాక, బోడపాలెం, నర్సీపట్నం మండలం వేములపూడి, మొండికండి, బలిఘట్టం చెందిన రైతులు కాలువలో కొంత మేర శ్రమదానంతో పూడిక పనులు చేపట్టారు. ఈ ఏడాది పుష్కలంగా వర్షాలు కురియడంతో తాండవ ప్రాజెక్టు నీరు అంతంత మాత్రంగా ప్రవహించినా ఇప్పటి వరకు సమస్య రాలేదు. ప్రస్తుతం వరి పంట పొట్ట దశలో ఉన్నందున ఈ సమయంలో కచ్చితంగా నీరు అవసరం ఉంటుంది. ఆశించిన విధంగా నీరు లేకపోతే ధాన్యం దిగుబడి తగ్గిపోతుందని రైతులు గగ్గోలు పెడుతున్నారు. అధికారులు ప్రత్యేక దృష్టి సారించి ప్రాజెక్టులో నీటి మట్టం బాగుంది కాబట్టి శివారు ఆయకట్టుకు నీరు అందించేలా చేయాలని కోరుతున్నారు.



తాండవ ప్రాజెక్టులో నిండుగా ఉన్న నీరు

వాటర్ ప్లాంట్‌ను అందుబాటులోకి తీసుకురావాలి



మూసి ఉన్న జీవీఎంసీ మినరల్ వాటర్ ప్లాంట్

అనకాపల్లి: వేల్పుల వీధిలో మినరల్ వాటర్ ప్లాంట్ సుమారు రెండు మాసాలుగా మూసేయడంతో పట్టణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సుమారు 10 సంవత్సరాల క్రితం పట్టణ ప్రజలకు పరిశుభ్రమైన తాగునీటిని అందించాలని వాటర్ ప్లాంట్‌ను జీవీఎంసీ అధికారులు ఏర్పాటు చేశారు. దీనిని మూసివేయడంతో పరిశుభ్రమైన తాగునీటి కోసం ప్రజలు పట్టణ పరిధిలో ప్రైవేట్ మినరల్ వాటర్ సరఫరాపై ఆధారపడాల్సి వస్తోంది. జీవీఎంసీ అధికారులు చర్యలు తీసుకుని ప్రభుత్వ మినరల్ వాటర్ ప్లాంట్‌ను అందుబాటులోకి తీసుకు రావాలని స్థానికులు కోరుతున్నారు. ఇక్కడ 20 లీటర్ల వాటర్ టిన్ రూ.4 కాగా, ప్రైవేట్ మినరల్ వాటర్ టిన్ రూ.10 నుంచి రూ. 15 వరకు వసూలు చేస్తున్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక



కలుసుకున్న పూర్వ విద్యార్థులు

మాకవరపాలెం: స్థానిక ఉన్నత పాఠశాల 1987–88 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం కేజీబీవీ పాఠశాల సమీపంలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా వారంతా చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఒకరికొకరు యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆనందంగా గడిపారు. ఈ సమ్మేళనంలో వివిధ ప్రాంతాలకు చెందిన సుమారు 60 మంది పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

అయ్యప్ప స్వాములకు భిక్ష



శ్రీ కాశీవిశ్వేశ్వర మృత్యుంజయుని ఆలయం వద్ద భిక్ష స్వీకరిస్తున్న అయ్యప్పస్వాములు

రోలుగుంట: స్థానిక కాశీవిశ్వేశ్వర మృత్యుంజయ ఆలయం వద్ద ఆదివారం అయ్యప్ప స్వాములకు భిక్ష ఏర్పాటు చేశారు. గురుస్వామి చింతకాయల తాతబ్బాయి పీఠం వద్ద స్వామికి పూజలు చేశారు. కొవ్వూరు, నాయుడుపాలెం గ్రామాలకు చెందిన అయ్యప్పస్వాములు ఈ పూజలో పాల్గొన్నారు.

భక్తులతో ధారమఠం కళకళ



ఆలయ ప్రాంగణంలో భారీగా వాహనాలు



ఆలయం వద్ద భక్తుల తాకిడి

గొలుగొండ: కార్తీక మాసం ఆదివారం కావడంతో పర్యాటకులు, భక్తులతో ప్రముఖ శైవక్షేత్రమైన ధారమఠం శివాలయం కిటకిటలాడింది. వందల సంఖ్యలో వాహనాలతో ఆలయ ప్రాంగణం నిండిపోయింది. కుటుంబ సమేతంగా వచ్చి ఇక్కడే అన్నసమారాధన కార్యక్రమాలు నిర్వహించారు. విజయవాడ, రాజమండ్రి, విశాఖ ప్రాంతాల నుంచి పర్యాటకులు తరలివచ్చారు. జలపాతాల వద్ద స్నానాలు ఆచరించి పరమశివుడిని దర్శించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా పోలీసులు, ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు. కృష్ణదేవిపేట ప్రాంతంలో ఉన్న అల్లూరి పార్కులో విద్యార్థులు సందడి చేశారు.



జలపాతాల వద్ద స్నానాలు చేస్తున్న యువత

పీఆర్సీ కమిషన్‌ను నియమించాలి



మాట్లాడుతున్న యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గొంది చిన్నబ్బాయ్

అనకాపల్లి: కూటమి ప్రభుత్వం తక్షణమే పీఆర్సీ కమిషన్ నియమించాలని, దాని కాలపరిమితి పూర్తయి 16 నెలలు అవుతున్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గొంది చిన్నబ్బాయ్ అన్నారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ పాలనలో పీఆర్సీ కమిషనర్‌గా డాక్టర్ మన్మోహన్ సింగ్‌ని నియమించిందని, కానీ ఉద్యోగులకు ఎలాంటి ఐఆర్ ప్రకటించకుండా కాలయాపన చేసిందని ఆయన పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఉద్యోగులంతా పీఆర్సీ కమిషన్‌ను నియమించి ఐఆర్ ప్రకటిస్తారనే ఆశతో ఎదురు చూస్తున్నారన్నారు. గత ప్రభుత్వం నుంచి ఇప్పటి వరకూ ఉద్యోగులకు రావాల్సిన ఆర్థిక బకాయిలు సుమారు రూ. 20 వేల కోట్లు అన్నారు. ఉద్యోగుల దాచుకున్న పీఎఫ్, ఏపీజీఎల్ఐ, జీఐఎస్, సంపాదిత సెలవుల నగదు, పదవీ విరమణ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని ఆయన కోరారు. పీఆర్సీ కమిషన్ వేసే వరకూ ఉద్యోగులకు ఐఆర్ ప్రకటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్షురాలు వి.శ్రీలక్ష్మి, గౌరవాధ్యక్షుడు నెల్లి సుబ్బారావు, కోశాధికారి జోగా రాజేష్, కార్యదర్శులు సూర్యప్రకాష్, పొలిమేర చంద్రరావు, రమేష్, చైతన్య శీల, కళింగ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

రైతు, కార్మిక చట్టాలకు వ్యతిరేకంగా 26న నిరసన



మాట్లాడుతున్న కర్రి అప్పారావు

అనకాపల్లి: రైతు, కార్మిక చట్టాలను కాలరాస్తున్న మోదీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఈనెల 26న దేశవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని రైతు కిసాన్‌మోర్చా జాయింట్ యాక్షన్ జిల్లా కార్యదర్శి కర్రి అప్పారావు తెలిపారు. స్థానిక కోడుగంటి గోవిందరావు భవనంలో రైతు కిసాన్ మోర్చా, ట్రేడ్ యూనియన్ల ఆధ్వర్యంలో ఆదివారం రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 18 నుంచి గ్రామాల్లో మోదీ ప్రభుత్వం తీసుకొచ్చిన చట్టాలపై అవగాహన కార్యక్రమాలు కల్పిస్తు 26న దేశవ్యాప్త నిరసన చేస్తున్నట్లు తెలిపారు. రైతులు, కార్మికులు, కూలీలు అందరూ పెద్ద ఎత్తున హాజరు కావాలని పిలుపునిచ్చారు. మోదీ ప్రభుత్వం కొత్తగా తీసుకురానున్న చట్టలను తక్షణమే నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు గాడి బాలు, వై.ఎస్.భద్రం, శంకరరావు, రంగారావు తదితరులు పాల్గొన్నారు.

ఫార్మా ప్రమాదాలపై చర్యలేవీ?

- సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కోటేశ్వరరావు



మాట్లాడుతున్న కోటేశ్వరరావు

అనకాపల్లి: జిల్లాలో ఫార్మా, కెమికల్స్ తదితర పరిశ్రమల్లో సెంట్రల్ ఇన్‌స్పెక్షన్ సిస్టం ఆధారంగా తనిఖీలు నిర్వహించకపోవడం, భద్రతా ప్రమాణాలు పాటించకపోవడంతో తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.కోటేశ్వరరావు అన్నారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో అచ్యుతాపురం మండలం ఎస్ఈజెడ్‌లో ఆగస్టు 21న జరిగిన ఎసెన్షియా ఫార్మా కంపెనీలో (రాంబిల్లి) జరిగిన ప్రమాదంలో 17 మంది మృత్యవాత పడ్డారని, 39 మంది స్వల్పగాయాలతో బయటపడినట్లు తెలిపారు. ఆ మరుసటి రోజు పరవాడ ఫార్మా సిటీలో సినర్జీన్ కంపెనీల్లో జరిగిన ప్రమాదంలో నలుగురు మృతి ఘటన జరిగి వంద రోజులు కావస్తున్నా కంపెనీలపై ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకోలేదన్నారు. ఈ ప్రమాదాలపై ప్రభుత్వం నియమించిన హై పవర్ కమిటీ రిపోర్టు నేటికీ బహిర్గతం చేయలేదని ఆయన ఆరోపించారు. ఈ పరిశ్రమల్లో సెంట్రల్ ఇన్‌స్పెక్షన్ సిస్టం ఆదేశాల మేరకు 2023 డిసెంబర్ మాసంలో తనిఖీలు నిర్వహించడం కోసం డిప్యూటీ ఫ్యాక్టరీ ఇన్‌స్పెక్టర్ ఆదేశాలు ఇచ్చినా నేటికీ పరిశ్రమల్లో తనిఖీలు జరగలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. టీడీపీ ప్రభుత్వం స్పీడ్ ఆఫ్ బిజినెస్ అని చెప్పుందని, కార్మికుల ప్రాణాలకు రక్షణ కల్పిస్తూ, వారికి భద్రత, ఉపాధి గ్యారెంటీ ఇస్తూ వాళ్లు స్వేచ్ఛగా పని చేసుకునే వాతావరణాన్ని కల్పించినప్పుడే పారిశ్రామికంగా అభివృద్ధి జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ, కోశాధికారి వి.వి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

చేతి బోరు ప్రారంభం



బోరును ప్రారంభిస్తున్న నాసా సంస్థ ప్రతినిధి

నాతవరం: గుమ్మడిగొండ పంచాయతీ శివారు చిన్న జగ్గంపేట గ్రామంలో నాసా సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చేతి బోరును ఆదివారం అ సంస్థ ప్రతినిధులు రాజాకులపతి, మైక్‌వైజరు ప్రారంభించారు. గిరిజనులు పడుతున్న ఇబ్బందుల దృష్ట్యా చేతి బోరు ఏర్పాటు చేశామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాసా సంస్థ సామాజిక మండల కార్యకర్త తాటిపాక శ్రీను, దళిత జిల్లా నాయకుడు కొండ్రు మరిడియ్య, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.